# అమ్మ



గోపీచంద్

బాబ్జీ మద్రాసు పనివుండి వెళ్తుంటే అతని మూడేళ్ళ కొడుకు 'నేనూ వస్తానని ఏడ్చాడు. అతని భార్య, "పోనీ తీసుకువెళ్ళండి. చెన్నపట్టణం చూస్తాడు" అన్నది. అతనికైతే యే మాత్రం తీసుకువెళ్దామనీ లేదు. కాని ఒక ప్రక్క వాడి ఏడుపూ..., రెండో ప్రక్క భార్య సలహాతో అతనికి అంగీకరించక తప్పలేదు.

మద్రాసు వెళ్ళే బండి అతని వూరికి రాత్రి తొమ్మిది గంటలకు వస్తుంది. అతను పిల్లవాడికి భోజనం పెట్టించి, తాను భోజనంచేసి, ప్రయాణ సౌకర్యం కోసం వీలైనంత తక్కువ సామాను తీసుకొని యెనిమిది గంటలకల్లా స్టేషనుకి చేరాడు. ఆ రోజు బండి ఒకగంట ఆలస్యంగా చేరింది...ఈలోగా పిల్లవాడు మారాం మొదలు పెట్టాడు. కనుపించినవన్నీ కొనిపెట్ట మన్నాడు. అప్పుడు భోజనంచేసి వచ్చి అమ్మేవాణ్ణి చూచి 'తైరుసాదం' పొట్లం కొనిపెట్ట మన్నాడు. ఎంత చెప్పినా కొనేవరకూ వినలేదు. కొన్నతర్వాత 'నాకు అక్కర్లేదు' అన్నాడు. పారేసేవరకూ వినలేదు. చివరకు ఎలాగైతేనేం, రైలు వచ్చింది. బాబ్జీ పిల్లవాణ్ణి తీసుకొని రెండోతరగతి పెట్టెలోకి యెక్కాడు. క్రింద ఒక సీటు ఖాళీగావుంది. పైన ఒక బర్త్ ఖాళీగావుంది. పై బెర్త్‌మీద ప్రక్కపరిచి, క్రింద ఖాళీగావున్న సీటులో కొడుకుని పెట్టుకు కూర్చున్నాడు బాబ్జి.

రైలు నాలుగయిదు స్టేషన్లు దాటింది. పెట్టెలో వాళ్లందరూ జోగుతున్నారు. పిల్లవాడి కళ్లు మూతలుపడుతున్నై. బండి తెల్లవారి ఎప్పుడో జేరుకుంటుంది మద్రాసు. పిల్లవాణ్ణి క్రింద సీట్లో పడుకోబెట్టి తాను పై బెర్త్‌మీద పడుకుందాం అనుకొని లేచి తాము కూర్చున్న ఖాళీలో దుప్పటి పరిచాడు బాబ్జీ. "పడుకో బాబూ" అన్నాడు. నిద్ర అసలే కళ్ళమీదకు వచ్చివుందేమో, పడుకోబెట్టీ పెట్టకముందే నిద్రపోయాడు పిల్లవాడు. బాబ్జీ తాను పరిచివున్న పై బెర్త్ ఎక్కి పడుకున్నాడు.

*  *  *

ఒక రాత్రివేళ అతనికి అకస్మాత్తుగా మెళకువ వచ్చింది. ఎవ్వరో క్రిదనుంచి తన చొక్కాలాగుతున్నట్టు అనిపించింది. బరువుకళ్ళతో తొంగి చూశాడు. క్రిందసీటులో కూర్చునివున్న పెద్దమనిషి తన కొడుకు పడుకొనివున్న సీటు పైపుకి చూపాడు. బాబ్జీ చూశాడు. ఆ సీటులో కొడుకు పడుకొని లేడు. పక్కమధ్య కూర్చొని, కుళ్ళి కుళ్ళి యేడుస్తున్నాడు.

బాబ్జీ కళ్లు నలుపుకొని క్రిందకుదిగి పిల్లవాడి ప్రక్కకు జేరాడు.

"ఎందుకు ఏడుస్తున్నావ్?" అన్నాడు.

కొడుకు ఏడ్పు మానలేదు.

"నేను యిక్కడే వున్నాగా!" అన్నాడు.

కొడుకు ఏడుపు బిగబట్టటానికి ప్రయత్నించాడు.

"పడుకో. మా నాన్నకదూ" అని వాణ్ణి పడుకోబెట్టటానికి ప్రయత్నించాడు బాబ్జీ.

వాడు కళ్లు తుడుచుకుంటూ, "అమ్మ కూలా నాదగ్గరలే పలుకునేది" అన్నాడు. అమ్మకూడా వాడిదగ్గరే పడుకునేదట. తను తన ప్రక్కనే పడుకోవాలని వాడి ఉద్దేశం. వాడు తన ఉద్దేశాన్ని బయటపెట్టినరీతికి, బాబ్జీకి నవ్వు వొచ్చింది.

"సరే నేనూ నీ దగ్గరేపడుకుంటాను. పడుకో" అన్నాడు.

కొడుకు పడుకున్నాడు. వాడి ప్రక్కనే పడుకున్నాడు బాబ్జీ. రైలు చీకటిని చీల్చుకొని వెళ్తూవుంది. పెట్టెలో వాళ్ళు ఎక్కడివాళ్లు అక్కడే కునికిపాట్లు పడుతున్నారు. బాబ్జీకి కొడుకు ప్రక్కన పడుకోవటానికి చోటు చాల్లేదు. అయినా ఎక్కడ కదిలితే ఎక్కడ వాడు నిద్ర పోడో అనే భయంకొద్దీ బిగపట్టుకొని అలాగే పడుకున్నాడు.

వొక స్టేషన్ వచ్చింది. పోయింది. ఇక పరవాలేదు అనుకున్నాడు బాబ్జీ. కొడుకు నిద్రపోయాడు అనుకున్నాడు. మనస్సులో యిక ఎప్పుడూ వాడితో యిటువంటి సంబంధం పెట్టుకోగూడదని

నిశ్చయించుకున్నాడు. కాని యింతలో కొడుకు గాలి ఎగపీలుస్తున్నట్టు అనుమానం వచ్చింది బాబ్జీకి. ప్రక్కకు తిరిగి చూశాడు. కొడుకు నిద్రపోలేదు. వాడిలో వాడే ఎక్కెక్కి ఏడుస్తున్నాడు.

''ఏం బాబూ?"

వాడు పలకలేదు.

"నిద్ర పట్టటంలా?"

వాడు ఏడ్పు మానలేదు.

బాబ్జీకి విసుగుపుట్టింది. ''పడుకో" అని కసురుకున్నాడు.

వాడు ఏడ్పు ఎక్కువచేశాడు. పెట్టెలో ప్రయాణీకులు యెక్కడ లేచి నిద్రాభంగం అయినందుకు చీదరించుకుంటారో అని భయంవేసింది అతనికి.

''ఊరుకో బాబూ, ఊరుకో" అని కొడుకుని బ్రతిమాలాడు. వాడు కొంచం నెమ్మదించిం తర్వాత..."ఏం బాబూ, నిద్రావటంలా?"

''వత్తావుంది."

"వస్తే మరి పడుకో" అన్నాడు.

''అమ్మా..." మొదలుపెట్టాడు పిల్లవాడు.

''ఆ! అమ్మ?" అడిగాడు బాబ్జి.

''నన్ను పలుకోబెట్టి జోకొట్టి, జోల పాలేది...'' అన్నాడు. అమ్మ తన్ను పడుకోబెట్టి జోల పాడేదట! ఇవన్నీ తన్ను చెయ్యమంటాడు వాడు. పడుకోబెట్టవచ్చు, జోకొట్టనూ వచ్చు. కాని జోలపాడేది ఎట్లా! బాబ్జీకి కోపం యెక్కువ అయింది. ఇంతలో కొడుకు ఏడుపు ఎక్కువచేశాడు.

"పడుకో బాబూ, పడుకో" అన్నాడు బాబ్జి. పడుకోబెట్టాడు. తాను పక్కన పడుకున్నాడు. జోకొట్టాడు. కానికొడుకు ఏడుపు మానలేదు.. జోల పాడటం ఒక్కటి మిగిలివుందని బాబ్జి గమనలో వుంది. కాని ఎలా జోల పాడటం? తన భార్య పాడుతుండగా విన్నాడుగాని... వెంటనే, తాను మేలుకొనివుంచే తన భార్య సాకే సాకులు ఇంకేమి సాక మ:టాడో అని భయంవేసింది బాబ్జీకి. వాణ్ణి నిద్రపుచ్చటం తన ప్రథమకర్తవ్యం అనుకున్నాడు. ఒకసారి పెట్టె కలయజూశాడు అంతానిద్రపోతున్నారు. తనను నిద్రనుంచి లేపిన పెద్దమనిషి కూడా కునుకుతున్నాడు. నెమ్మదిగా కూనిరాగంలో మొదలుపెట్టాడు బాబ్జి.

"జో అచ్చుతానంద జోజోముకుందా!
రార పరమానంద రామ గోవిందా!
జో—జో—"

